క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ యువ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్ పార్టీ యువ సమ్మేళనాన్ని ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. యువకులు, విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష


దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. అభివృద్ధి పరంగా అన్ని రంగాల్లో గ్రామం ముందంజలో ఉన్నా మండలం ఏర్పాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

కాంగ్రెస్ నేత పాండు


ఎస్వీబీ కాలనీ రోడ్డును చదును చేయిస్తున్న పాండు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని ఎస్వీబీ కాలనీలో మట్టిరోడ్డు అస్తవ్యస్తంగా మారింది. స్థానిక కాంగ్రెస్ నాయకుడు సుబ్బురి పాండు సొంత డబ్బులతో మట్టి రోడ్డును బాగుచేయించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కొత్తగా వెలుస్తున్న ఎస్వీబీ కాలనీ నుంచి ఎంబీఆర్ నగర్‌ను కలుపుతూ 20 ఫీట్ల రోడ్డు ఉంటుందని సుబ్బురి పాండు తెలిపారు. ఈ రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేదన్నారు. సుమారు రూ.50వేలు ఖర్చుపెట్టి 70 ట్రాక్టర్ల మట్టిని పోసి ఒక లెవల్ వచ్చేవిధంగా రాకపోకలకు వీలుండేలా ఈ రోడ్డును వేసినట్లు తెలిపారు. రెండు కాలనీలకు లింకు రోడ్డుగా మారిందన్నారు. కాలనీలోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని పాండు తెలిపారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోండి: ఎమ్మార్పీఎస్

తలకొండపల్లి: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ స్కూళ్ల పర్మిషన్‌ను రద్దుచేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కిరణ్‌పూలే డిమాండ్ చేశారు. మంగళవారం తలకొండపల్లిలోని అంబేడ్కర్ భవనంలో ఆయన మాట్లాడారు. మండలంలో ప్రైవైట్ పాఠశాలల యజమాన్యాలు ఇష్టారీతిగా వ్యవరిస్తూ.. అధిక ఫీజులు వసూల్ చేస్తున్నాయని ఆరోపించారు. బీఈడీ, టీచర్ ట్రైనింగ్ (టీటీసీ) చేసిన ఉపాధ్యాయులతో బోధన చేయాలని నిబంధనలున్నా.. అందుకు విరుద్ధంగా ట్రైనింగ్ లేని ఉపాధ్యాయులతో పాఠాలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వసతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని అన్నారు. ఈ విషయంపై ఎంఈఓ సర్దార్‌నాయక్‌ను వివరణ కోరగా కొందరు కావాలనే తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేట్ స్కూళ్లకు నోటీసులు అందజేశామని.. అయినప్పటికీ వారి తీరు మారకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మహేష్, అనిల్, కుమార్, శివ, సురేష్, శివరాజు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి నియామకంపై హర్షం

తలకొండపల్లి: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎన్నికల కమిటీ చైర్మన్‌గా ఈటల రాజేందర్ నియామకంపై బీజేపీ మండల అధ్యక్షుడు తిర్మణి రవిగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అధిష్టానం ఈ నిర్ణయం తీసుకుందని.. కిషన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ మరింత బలోపేతం అయ్యిఇ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

బైక్ చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

ఇబ్రహీంపట్నం: బైక్ చోరీ కేసులో నిందితుడిని ఇబ్రహీంపట్నం పోలీసులు పట్టుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులో కృష్ణప్రసాద్.. బైక్ ఇటీవల చోరీకి గురైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా వాహనాల తనిఖీల్లో భాగంగా ఇబ్రహీంపట్నంలో ఈ వాహనం పట్టుపడినట్లు తెలిపారు. చోరీకి పాల్పడిన గణేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. చోరీలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోదాం నిర్మించారు.. వదిలేశారు

- రూ.40 లక్షలతో మంచాలలో గోదాంను నిర్మించిన ప్రభుత్వం
- రైతులే లీజుకు తీసుకోవాలంటున్న అధికారులు
- మూడున్నరేళ్లుగా ఉపయోగంలోకి రాని వైనం


మంచాలలో ప్రభుత్వం నిర్మించిన గోదాం

మంచాల: లక్షలాది రూపాయాల ప్రజాధనం ఖర్చుపెట్టి నిర్మాణం చేసిన ప్రభుత్వ గోదాంలు నిరుపయోగంగా మిగిలిపోతున్నాయి. నిర్మాణం చేసి మూడున్నర సంవత్సరాలు కావొస్తున్నా రైతులు ఉపయోగించిన పాపాన పోలేదు. వివరాల్లోకి వెళ్తే.. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఉపయోగంగా ఉండే విధంగా పెద్దఎత్తున గోదాంల నిర్మాణాలు చేపట్టింది. అందులో భాగంగా మంచాల మండల కేంద్రంలోని 685 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో రూ.40లక్షలు ఖర్చు పెట్టి మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో గోదాం నిర్మాణం చేపట్టారు.

రైతులే లీజుకు తీసుకోవాలని మెలిక..

రైతులెవరైనా ఏడాదికి రూ.70వేలు చొప్పున చెల్లించి లీజుకు తీసుకొని ఉపయోగించుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించి గోదాంను ఉపయోగించుకునే స్థితిలో మంచాల మండలంలోని రైతులు ఎవరూ లేరు. రానున్న వర్షాకాలంలో ధాన్యం నిల్వ చేసుకోవడానికి రైతులకు గోదాంలు లేక ఇబ్బంది పడే అవకాశం ఉంది. తక్షణమే ప్రభుత్వం లీజు విధానం రద్దు చేసి రైతుల నుంచి నిర్వహణ ఖర్చులు (మెయింటెనెన్స్ ఫీజ్) మాత్రమే తీసుకొని గోదాంను ఉపయోగంలోకి తీసుకొని రావాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం ఎలా నిల్వ చేసుకోవాలి?



వర్షాలకు ధాన్యం నిల్వ చేసుకోవడం కష్టంగా మారింది. మంచాలతోపాటు మండలంలోని రైతులకు వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా గోదాంను ఉపయోగంలోకి తీసుకొని రావాలి.

– శ్రీనివాస్, రైతు, మంచాల

ఉపయోగంలోకి తేవాలి



మంచాలలో గోదాంను రైతు లు ఉపయోగించుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసు కోవాలి. లీజ్ వ్యవస్థను రద్దు చేయాలి. అప్పుడే చిన్న, సన్నకారు రైతులకు మేలు జరుగుతుంది. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ, మంచాల

ముద్వీన్‌లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కడ్తాల్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు, దివ్యాంగులకు.. సర్వ దివ్యాంగుల సేవా సంస్థ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ముద్వీన్ గ్రామంలో సర్వ దివ్యాంగుల సేవా సంస్థ (సీబీఆర్ ప్రాజెక్ట్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ అనిల్‌కుమార్, సర్పంచ్ యాదయ్య, ఎంపీటీసీ నిర్మలాదేవి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఉపసర్పంచ్ వినోద్, సర్వ దివ్యాంగుల సేవా సంస్థ అధ్యక్షురాలు మీనాక్షీ, సంస్థ సభ్యులు సార, శ్రీనివాస్, వైద్యులు స్నిగ్ధ, షాగుప్తా, క్యాంపు మెనేజర్ దామోదర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో సమస్యలు పరిష్కరించండి

అదనపు కలెక్టర్‌కు ఏబీవీపీ నాయకుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం అదనపు కలెక్టర్ తిరుపతిరావ్‌ను ఏబీవీపీ నాయకులు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాలలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు వివరించారు. ఆమనగల్లులో బీసీ హాస్టల్ ఎత్తివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆమనగల్లులో ఉన్న గురుకుల పాఠశాలను షాబాద్‌లో నిర్వహిస్తున్నారని తిరిగి ఆమనగల్లులోనే నిర్వహించాలని వారు కోరారు. బస్టాండ్ వద్ద ఉన్న ఉన్నత పాఠశాల కూలిపోయే స్థితిలో ఉందని.. వెంటనే నూతన భవనం నిర్మించాలని వారు కోరారు. నాలుగు మండలాలకు కూడలి అయిన ఆమనగల్లులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఏబీవీపీ నాయకులు భరత్, మల్లేశ్, విజయ్, చంటి పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లు కట్టించి ఇవ్వాలి


డబుల్ ఇళ్లకు కేటాయించిన స్థలాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ

కడ్తాల్: చల్లంపల్లి గ్రామంలో పేదల కోసం కేటాయించిన స్థలంలో వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో 2015 సంవత్సరంలో పేదలకు డబుల్‌బెడ్ ఇళ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన స్థలాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. చల్లంపల్లి గ్రామంలో ఇళ్లస్థలాల కోసం 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం 7ఎకరాల భూమి కొనుగోలు చేసిందని.. ప్రతి ఎన్నికల సమయంలో ఇళ్లస్థలాలు పంచుతామని, ఇళ్లు కట్టించి ఇస్తామని హామీలు ఇస్తూ ఓట్లు వేయించుకుంటూ మోసం చస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్.. గ్రామంలోని ఇళ్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీచ్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ సర్పంచ్ నరేందర్, నాయకులు తిరుపతిరెడ్డి, రమేశ్‌గౌడ్, జంగయ్యగౌడ్, శేఖర్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణం అభినందనీయం

కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, నర్సింహారెడ్డి


రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్లు

హయత్‌నగర్: భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విశ్వాసం పొందిన అమ్మవారి ఆలయాన్ని పునర్నిర్మించడం ఎంతో అభినందనీయమని కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో నిర్మించనున్న హయత్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవ వాల్‌పోస్టర్, కరపత్రాన్ని మంగళవారం వారు ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్ర రవీందర్, గౌరవ అధ్యక్షుడు పారంద స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్‌యాదవ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు బండారి భాస్కర్, పారంద మహేష్, టీఆర్ఎస్ నాయకుడు బోడ భిక్షపతి, ఆలయ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

మంచాల: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 5న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ నర్మద అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

రైతుబంధు దరఖాస్తు గడువు పొడిగింపు

మంచాల: రైతుల వినతి మేరకు రైతుబంధు దరఖాస్తు చివరి తేదీని పొడగించినట్లు మండల వ్యవసాయాధికారి జ్యోతిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ సాయంత్రం లోపు కొత్తగా రైతు బంధు కోరకు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ధరణిలో 18వ తేదీ వరకు నమోదైనా పాసుపుస్తకాలు రాని రైతులు కూడా పాసుపుస్తకం నమోదు నంబర్ ఆధారంగా రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పాసు పుస్తకం ఖచ్చితంగా ఇవ్వావల్సిన అవసరం లేదన్నారు. వచ్చిన దరఖాస్తులన్నీ స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయుటకు 24 గంటలకు పైగా సమయం పడుతుందన్నారు. కావున రైతులు చివరి తేదీకి ఒకరోజు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

తలకొండపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని 39 పోలింగ్ బూత్‌లను మంగళవారం తహసీల్దార్ కృష్ణ పరిశీలించారు. పోలింగ్ బూత్‌లలో కనీస సౌకర్యాలు ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండల కేంద్రంతో పాటు పడకల్, దేవుని పడకల్, చుక్కాపూర్, చెన్నారం, యడవల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సందర్శించారు. విద్యుత్, తాగునీటి వసతి, ఇంటర్నెట్ సౌకర్యం, దివ్యాంగులకు ర్యాంపు సౌకర్యం, టాయ్‌లెట్లు, వెంటిలేషన్ తదితర వసతులు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఆయా అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. డీటీ సంతోష్, ఆర్ఐ మంజుల పాల్గొన్నారు.

తాలు విత్తనాలపై విచారణ

యాచారం: ‘హైబ్రీడ్ వరి విత్తనాల్లో తాలు’ అనే కథనంపై మంగళవారం మహేంద్ర అగ్రీ కంపెనీ ప్రతినిధులు విచారణ చేపట్టారు. కంపెనీ ప్రతినిధులు మంగళవారం మొండిగౌరెల్లి గ్రామాన్ని సందర్శించి తాలు విత్తనాలను పసిగట్టిన రైతు కౌలాన్ మల్లారెడ్డిని కలిసి వివరాలు తెలుసుకున్నారు. రైతు మల్లారెడ్డి ఎంపీ-3030 ప్లస్ హైబ్రీడ్ రైస్ సీడ్స్ 6 బ్యాగుల విత్తనాలను కొనుగోలు చేసి సోమవారం నీళ్లల్లో నానాబెట్టగా నీళ్లల్లో తేలిన విషయం గుర్తించి వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మల్లారెడ్డి ద్వారా తాలు విత్తనాలపై వివరాలు తెలుసుకుని తగు న్యాయం చేస్తామని.. భవిష్యత్తులో నాణ్యమైన విత్తనాలనే సరఫరా చేసేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన పాతకోట రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. రాములు కుమారుడు, యూత్ కాంగ్రెస్ నాయకుడు పాతకోట రాజును మంగళవారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5 వేలను రాజుకు అందజేశారు. ఆపదలో ఉన్నవారికి ఐక్యతా ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, అశోక్, ప్రసాద్, నరేందర్‌గౌడ్, తిరుపతి, యాదయ్య, శివ పాల్గొన్నారు.

ఇంటర్ కళాశాల భవన నిర్మాణం పూర్తిచేయాలి

ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఫరీద్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలని మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎండీ.ఫరీద్ కోరారు. కళాశాల భవన నిర్మాణంతో ఈ ఏడాది విద్యార్థుల ఇబ్బందులు తీరుతాయని భావిస్తే కొన్నిరోజులుగా నిర్మాణ పనులు నిలిచిపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జోక్యం చేసుకుని పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థులు, ప్రజలతో కలిసి భవనం ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు మహేశ్, లక్ష్మణ్, ఆబేద్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు అండగా సర్కార్


కడ్తాల్: గీతన్న బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: కల్లుగీత కార్మికులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ముద్వీన్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు లక్ష్మయ్యగౌడ్‌కు కొన్నిరోజుల క్రితం తాటిచెట్టుపై నుంచి పడగా తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే సహకారంతో బాధితుడికి ప్రభుత్వం నుంచి రూ.5లక్షల చెక్కు మంజూరైంది. మంగళవారం ఎమ్మెల్యే.. బాధితుడి కుమారుడు మల్లయ్యకు సంబంధిత చెక్కు అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కులవృత్తుల సంక్షేమానికి కృషిచేస్తుందని అన్నారు. గీత కార్మికులకు చెట్లపన్ను రద్దు చేయడం జరిగిందని తెలిపారు. గౌడ, గీత కార్మికులు ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడితే గీతన్న బీమా పథకం కింద ఆర్థికసాయం అందజేస్తున్నామన్నారు. ఉపసర్పంచ్ వినోద్, నాయకులు గోపాల్, మహేందర్, శ్రీను, వీరయ్య, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: మండలం పరిధిలోని చెన్నారం గ్రామానికి చెందిన నరసింహకు రూ.24,000 సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. హైదరాబాద్‌లో మంగళవారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

పార్టీ జిల్లా కార్యదర్శి రాములు


ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ జిల్లా కార్యదర్శి పొట్టి రాములు పేర్కొన్నారు . మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పటేల్‌గూడ 131, 132, 133 బూతుల్లో ‘మేరా బాత్ సబ్సే మజ్బూత్’ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పొట్టి రాములు మాట్లాడుతూ.. 9 సంవత్సరాల కాలంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రూ.11 కోట్లకు పైగా రైతుల ఖాతాలకు ఏడాదికి రూ.6వేలు ప్రతి ఒక్కరికి అందజేస్తున్నట్లు చెప్పారు. యువతకు ముద్రలోన్లు అందించి వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో వీటన్నింటినీ ప్రజలకు వివరించి తెలంగాణలో బీజేపీ సర్కార్ ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపటేల్‌గూడ నుంచి బొంగ్లూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారయణయాదవ్, అశోక్‌గౌడ్, మనోహర్‌లాల్, ప్రభాకర్‌గౌడ్, గణేష్, వీరస్వామి, నిరంజన్, రాఘవేందర్, శ్రీకాంత్, మహేష్, రాజు, జంగయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.


కడ్తాల్: కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

దొడ్డి కొమురయ్యకు నివాళి

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తొలి తెలంగాణ అమర వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని మంగళవారం కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాలు, రాజకీయ నాయకులు, కులమతాలకు అతీతంగా కొమురయ్య చిత్రపటాలకు నివాళులర్పించారు. భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటం చేసిన మహనీయుడు కొమురయ్య అని కొనియాడారు. దేశ్‌ముఖ్‌ల ఆక్రుత్యాలకు వ్యతిరేకంగా కొమురయ్య చేసిన పోరాటం ఎనలేనిదన్నారు. నేటి యువత ఆయన పోరాట పటిమను ఆశయంగా తీసుకోవాలన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


తలకొండపల్లి: నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


తుర్కయంజాల్: కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కురుమసంఘం నేతలు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ


సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న అనురాధ

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. మంగళవారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో హెచ్ఎం డబ్ల్యూఎస్, ఇఇఎస్ఎల్ (వీధి దీపాల), విద్యుత్ అధికారులు, పురపాలక సంఘం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు వార్డుల్లో నెలకొన్న నీటి సమస్య, పైప్‌లైన్ మరమ్మతులు, వీధి దీపాల నిర్వాహణ, బోనాల పండుగ ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అందరూ సమన్వయంతో పనిచేసి స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ, డీఈ సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఇంజనీరింగ్ ఏఈ గుణాకర్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ వినయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఆర్ఐ బాల్‌రాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోశయ్య సేవలు చిరస్మరణీయం

ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్


రోశయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని గాంధీచౌక్ వద్ద మంగళవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాండురంగయ్య, యాదయ్య, డాక్టర్ శ్రీనివాస్, నర్సింహ, పాపిశెట్టి రాము, రవి, మేడిశెట్టి శ్రీధర్, శ్రీనివాస్, రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.